# సాక్షి అనంతపురం

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



**చీనీ టన్ను రూ.22,670**

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.22,670 ప్రకారం ధర పలికాయి.



**'లెక్క'లే తప్పారు!**

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో ఎక్కువమంది విద్యార్థులు గణితం సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు.

8లో

గరిష్టం/కనిష్టం
40.3°/22.8°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుల నియామకం



బోరెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ రమేష్‌రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్రం కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్సీ బోరెడ్డి నరేష్‌కుమార్‌రెడ్డి, హిందూపురం పరిశీలకులుగా ఆర్ రమేష్‌రెడ్డి నియమితులయ్యారు.

### శింగనమల సమన్వయకర్తగా సాకే శైలజానాథ్



శింగనమల: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా సాకే శైలజానాథ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. సమన్వయకర్తగా సాకే శైలజానాథ్‌ను నియమించడంతో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

### చెర్లోపల్లి - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దష్ట్యా చెర్లోపల్లి - తిరుపతి మధ్య వయా వికారబాద్, గుంతకల్లు, కడప మీదుగా ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి గురు, శుక్రవారాల్లో ఈ రైళ్లు నడుస్తాయన్నారు. మే 8వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ రాకపోకలు ఉంటాయని పేర్కొన్నారు. చెరోపల్లి నుంచి ఈ రైలు (07257) 8వ తేదీ (గురువారం) సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.40 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుతుందన్నారు. తిరిగి అదే రైలు (07258) అదే రోజు (శుక్రవారం) మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు చెర్లోపల్లి జంక్షన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు సనత్‌నగర్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాద్గిరి, కృష్ణ, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, కోడూరు, రాజంపేట, రేణుగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుందన్నారు.

### ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు



రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన లగేజ్ స్కానర్

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో లగేజ్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. పేలుడు పదార్థాలు, గంజాయి, మాదకద్రవ్యాలు, ఇతర ప్రమాదకర వస్తువుల రవాణాను అరికట్టేందుకు ఈ స్కానర్ దోహదపడుతుందని అధికారులు తెలిపారు. అంతేకాక రైల్వేస్టేషన్ తోపాటు పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

## రాయితీ విత్తనానికి కూటమి కత్తెర

కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తూనే ఉంది. అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామన్న హామీని అటకెక్కించారు. ఇన్‌పుట్, పంటల బీమాను పక్కన పెట్టేశారు. కంటి తుడుపుగా కరువు మండలాలను ప్రకటించడంతో జిల్లా రైతులు నష్టపోయారు. ఇప్పుడు తాజాగా రాయితీ విత్తనాల పంపిణీలో కత్తెర వేయడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.



విత్తన వేరుశన

- ఖరీఫ్ విత్తన కేటాయింపులు బాగా తగ్గించేస్తూ ఉత్తర్వులు
- 1,51,978 క్వింటాళ్లకు గానూ 54,184 క్వింటాళ్లకే అనుమతి
- విత్తనాల కోసం అన్నదాతలు అవస్థలు పడాల్సిన దుస్థితి

అనంతపురం అగ్రికల్చర్: జూన్ నుంచి ప్రారంభం కానున్న కీలకమైన ఖరీఫ్‌కు సంబంధించి అన్నదాతకు రాయితీ విత్తనాలు అందకుండా కూటమి సర్కారు కత్తెర వేసింది. ప్రతిపాదిత విత్తన ప్రణాళికను పక్కనపెట్టి మూడో వంతు కత్తెర వేసి నామమాత్రంగా కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో రానున్న ఖరీఫ్‌లో విత్తనం కోసం రైతులు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. అసలే కరువు పరిస్థితులు, ప్రభుత్వం నయాపైసా సాయం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కష్టసమయంలో కనీసం విత్తనాలు కూడా సక్రమంగా అందివ్వకపోవడంపై రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. 1,51,978 క్వింటాళ్ల రాయితీ విత్తనాలు కేటాయించాలని ప్రతిపాదనలు పంపగా... కొర్రీలు వేసి చివరకు 54,184 క్వింటాళ్ల మాత్రమే కేటాయించారు.

**అన్నింటిలో కోతలే..**

ఖరీఫ్‌లో జిల్లా రైతులకు రాయితీతో 1,51,978 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి, కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపారు. సాధారణంగా జిల్లా నుంచి వెళ్లిన ప్రతిపాదనలు యథావిధిగా ఆమోదిస్తూ అనుమతించడం కొన్నేళ్లుగా జరుగుతోంది. అయితే ఈసారి ప్రతిపాదనలకు భారీగా కత్తెర వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. జూన్ నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్-2025కు సంబంధించి మొత్తంగా 1,51,698 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నివేదించారు. అందులో ప్రధాన పంట వేరుశనగ 1.45 లక్షల హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేసి 1,33,763 క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ అవసరమని ప్రతిపాదించారు. అయితే కేవలం 50,592 క్వింటాళ్లు ఇచ్చారు. ఇలా... అన్ని రకాల విత్తనాలు బాగా తగ్గించేసి కేటాయింపులు చేయడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

**ఖరీఫ్‌కు విత్తన ప్రతిపాదనలు, కేటాయింపులు (క్వింటాళ్లలో)**

| విత్తనాలు | ప్రతిపాదనలు | కేటాయింపు |
|---|---|---|
| వేరుశనగ | 1,33763 | 50,592 |
| కందులు | 5,347 | 2,380 |
| వరి | 8,054 | 800 |
| మొక్కజొన్న | 2,300 | 00 |
| జొన్న | 375 | 00 |
| కొర్ర | 60 | 45 |
| ఆముదం | 875 | 00 |
| పొద్దుతిరుగుడు | 85 | 00 |
| ఉలవ | 125 | 00 |
| మినుము | 54 | 36 |
| పచ్చిరొట్ట | 750 | 207 |
| పెసలు | 95 | 60 |
| అలసందలు | 85 | 60 |
| రాగులు | 10 | 4 |
| మొత్తం | 1,51,978 | 54,184 |

**కూటమి పాలనలో రైతులకు కష్టాలు**



కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సాయమూ అందలేదు. రైతు సంక్షేమాన్ని గాలికివదిలేయడంతో కరువు జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరగడం, ఉన్న వాటికి మద్దతు ధరలు లేక పంటలు సాగు చేయలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న ఖరీఫ్‌లో విత్తన కేటాయింపులు తగ్గించేయడం దారుణం. విత్తన కేటాయింపు పెంపుపై చంద్రబాబు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

**కేటాయింపులు, సబ్సిడీ పెంచాలి**



కరువు పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో విత్తన కేటాయింపులు తగ్గించడం రైతులను ఇబ్బందులకు గురి చేయడమే. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందక ఇప్పటికే సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. విత్తన వేరుశనగ, ఇతర విత్తనాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలి. కేటాయింపులు బాగా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒక్కో రైతుకు ఐదు బస్తాల విత్తనకాయలు ఇవ్వాలి. నష్టపోయిన రైతులకు పంటల బీమా కింద పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించాలి.

– ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం అనుబంధ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

### 1 నుంచి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు' అవతరణ



ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో బ్యాంకింగ్ కార్యకలాపాలు సాగిస్తున్న నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ పూర్తయినట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) రీజనల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీజీబీ ప్రాంతీయ కార్యాలయంలో ఆర్ఎం శ్రీదేవి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులన్నీ ఒకటిగా విలీనం అవుతున్నాయన్నారు. మే ఒకటి నుంచి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు'గా అవతరించనున్నట్లు తెలిపారు. అన్ని గ్రామీణ బ్యాంకులు విలీనం కానున్న నేపథ్యంలో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఖాతానెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, బ్రాంచి చిరునామాల్లో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండదన్నారు. అన్ని డిపాజిట్ ఖాతాలు, రుణాలు, సేవలు, చెక్‌బుక్కులు, పాస్‌బుక్కులు, ఏటీఎం కార్డులు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. కేవలం వడ్డీరేట్లలో కొంత వ్యత్యాసం ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు చైతన్యకుమార్, శ్రీధర్, శివకుమార్, శేషసాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### బీపీఈడీ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య బి.అనిత

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో బీపీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య బి.అనిత మంగళవారం విడుదల చేశారు. మొత్తం 63.51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేశ్వర్లు, ఎస్కేయూ న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అత్యుత్సాహం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అరెస్ట్

తాడిపత్రిటౌన్: నియోజకవర్గంలోని యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన పర్యటనను పోలీసులు అడ్డుకున్నారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసుల వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వివరాల్లోకెళితే.. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వగ్రామం పుట్లూరు మండలం తిమ్మంపల్లి నుంచి యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ, విందులో పాల్గొనేందుకు మంగళవారం బయలుదేరారు. అయితే యాడికి మండలం భోగాలకట్ట వద్దకు రాగానే సీఐ రామసుబ్బయ్య పోలీసులతో వచ్చి పర్యటనను అడ్డుకున్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి కండ్లగూడురులో జరిగే విందు కార్యక్రమానికి హాజరవుతున్నారని, మీరు వెళ్తే గొడవలు జరిగే అవకాశం ఉందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో అడ్డుకుంటున్నామన్నారు. మున్సిపల్ చైర్మన్ వస్తే మాజీ ఎమ్మెల్యేను అడ్డుకుంటారా? ఎవరయ్యా మీకు చెప్పింది అంటూ కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఏఏ గ్రామాలకు వెళ్లకూడదో మీ పై అధికారులు ఏమైనా లిస్ట్ ఇచ్చారా.. ఉంటే చెబితే ఆ గ్రామాలకు వెళ్లనంటూ సీఐ రామసుబ్బయ్యతో ఆయన వాగ్వాదానికి దిగారు. దాదాపు గంట పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. చివరకు కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, వెనక్కు తిప్పి పంపించారు.

## రిజిస్ట్రేషన్లు డీలా

- 68 శాతంతోనే ఆగిపోయిన జిల్లా రిజిస్ట్రేషన్ల ఆదాయం
- వార్షిక లక్ష్యం దరిదాపుల్లో కూడా లేని దుస్థితి
- గడిచిన 30 ఏళ్లలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదన్న అధికారులు
- నాయకుల బెదిరింపులు, ఆక్రమణలతో ముందుకురాని కొనుగోలుదారులు

జీవితంలో సొంతిళ్లు లేదా రెండు సెంట్ల స్థలాన్ని కొనుక్కోవాలన్న సామాన్య, మధ్య తరగతి కుటుంబాల ఆశలను కూటమి ప్రభుత్వం చిదిమేసింది. ప్రభుత్వం మారినప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా కూటమి నాయకుల ఆక్రమణలు, భూకబ్జాలు, గొడవలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు డీలా పడ్డాయి. వార్షిక లక్ష్యానికి దరిదాపుల్లో కూడా లేని దుస్థితి నెలకొంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నాలుగు ప్లాట్‌లు కొని పెట్టుబడి పెట్టుకుందామని అనుకునే సగటు వేతన జీవులు హడలిపోయే పరిస్థితి నెలకొంది. ఖాళీ జాగా కనిపిస్తేనే చాలు కూటమి నాయకులు కబ్జా చేస్తున్నారు. దీంతో స్థిరాస్తి పెట్టుబడి పెట్టడం వద్దనుకుని చాలా మంది బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకుంటున్నారు. దీంతో అనంతపురం జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వచ్చే ఆదాయం గతంలో ఎప్పుడూ లేని విధంగా తగ్గిపోయింది. నిర్ణయించిన లక్ష్యానికి చేరువ కాలేక పోయారు.

**68% దగ్గరే ఆగిపోయిన ఆదాయం**

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ద్వారా ప్రభుత్వానికి రూ.469.65 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. మేలో ఎన్నికలు జరిగాయి. జూన్ 12న కూటమి సర్కారు కొలువుదీరింది. అక్కడి నుంచే మొదలైంది రివర్స్ పాలన. 2024 జూన్ 12 మొదలు నేటికీ రిజిస్ట్రేషన్లు ఊపందుకోలేదు. ఎమ్మెల్యేల దందాలు, కబ్జాలతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ఖాళీ స్థలాలు, అప్పటికే నిర్మాణం పూర్తయిన అపార్ట్‌మెంట్లు ఒక్కసారిగా కొనుగోళ్లు లేక చతికిలపడ్డాయి. గతంలో ఎప్పుడూ 80 శాతానికి పైగా వసూళ్లు వచ్చేవి. కానీ కేవలం 68 శాతం మాత్రమే ఈ ఏడాది వసూళ్లయ్యాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అంచనా వేయొచ్చు.



**రాప్తాడులో తమ్ముళ్ల దెబ్బకు..**

అనంతపురం జిల్లాలో చాలావరకు రాప్తాడు నియోజకవర్గ పరిధిలో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ టీడీపీ నాయకుల దెబ్బకు స్థిరాస్తి రంగం కుదేలైంది. ఎక్కడ వెంచర్లు వేసినా వసూళ్ల కోసం కూటమి నాయకులు గద్దల్లా వాలిపోతున్నారు. మొన్నటికిమొన్న హంపాపురం దగ్గర ఏకంగా జేసీబీలనే పనిచేయకుండా ఆపేశారు. సవేరా హాస్పిటల్ దగ్గర బిల్డర్లను బెదిరించిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఎక్కడ చూసినా భూఆక్రమణలు, బెదిరింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. దీంతో ఎవరైనా కొత్తగా వెంచర్లు వేయాలంటేనే భయపడుతున్నారు.

**2024-25 ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం (రూ.కోట్లలో)**

| కార్యాలయం | వార్షిక లక్ష్యం | రాబడి |
|---|---|---|
| గుత్తి | 21.70 | 13.28 |
| గుంతకల్లు | 33.65 | 20.13 |
| కళ్యాణదుర్గం | 23.60 | 16.61 |
| పామిడి | 16.00 | 7.79 |
| రాయదుర్గం | 24.10 | 17.06 |
| శింగనమల | 13.31 | 7.65 |
| తాడిపత్రి | 58.00 | 27.14 |
| ఉరవకొండ | 15.95 | 14.20 |
| యాడికి | 7.73 | 4.28 |
| అనంతపురం | 158.85 | 94.99 |
| అనంతపురం రూరల్ | 85.18 | 57.72 |

## సనపకు పోటెత్తిన భక్తజనం

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో ఊరి దేవరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. 35 సంవత్సరాల తరువాత నిర్వహించిన ఊరి దేవరకు వేల సంఖ్యలో ప్రజలు రావడంతో సనప గ్రామం కిటకిటలాడింది. సోమవారం అర్ధరాత్రి సమయంలో పెద్దమ్మ తల్లి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జంతువులను బలిఇచ్చారు. మంగళవారం భక్తులు అమ్మవారికి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఇంట్లో మొక్కుబడిలో భాగంగా పొట్టేళ్లు, గొర్రెలను బలి ఇచ్చారు. గ్రామంలోకి వచ్చేందుకు ప్రజలకు గంటల సమయం పట్టింది. మూడు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.



భక్తులు, వాహనాలతో అత్యంత రద్దీగా కనిపిస్తున్న సనప గ్రామం (ఇన్‌సెట్‌లో)పెద్దమ్మ తల్లి విగ్రహం వద్ద టెంకాయలు కొడుతున్న భక్తులు

### నేడు ఏపీ పాలిసెట్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ సి.జయచంద్రారెడ్డి

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహిస్తున్న ఏపీ పాలిసెట్-2025ను బుధవారం నిర్వహిస్తున్నట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 8,879 మంది విద్యార్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందులో బాలురు 5,344 మంది, బాలికలు 3,551 మంది ఉన్నారు. ఉదయం 10 గంటలల్లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని జయచంద్రారెడ్డి సూచించారు. 11 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్ట చేశారు.

### 1 నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు

అనంతపురం: జిల్లాలో పలు ప్రాంతాల్లో మే 1 నుంచి మే 31 వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. ఉదయ్‌భాస్కర్ తెలిపారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కర్రసాము, ఖోఖో, టేబుల్ టెన్నిస్, తైక్వాండో, వాలీబాల్ ,రైఫిల్ షూటింగ్, ఫెన్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా క్రీడాభివృద్ధిశాఖ కార్యాలయం, అశోక్‌నగర్‌లో సంప్రదించాలన్నారు.

### జిల్లాకు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల రెండు రోజుల్లో జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎం.విజయ శంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త జి.నారాయణస్వామి తెలిపారు. సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించిన ఉపరితల ద్రోణి, అలాగే ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ, నైరుతి గాలులు వీస్తున్నందున ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం అక్కడక్కడ పడవచ్చన్నారు.

## క్లుప్తంగా

### ఆలూరు సాంబ విదేశీ పర్యటన



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎన్‌ఆర్‌ఐ విభాగం గ్లోబల్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి విదేశీ పర్యటన వెళ్లనున్నారు. మంగళవారం మే 12వ తేదీ వరకూ ఆయన ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలలో పర్యటించనున్నారు. 2029లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకోవడంలో భాగంగా ప్రవాసాంధ్రుల మద్దతును కూడగట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ... గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ చేపట్టిన విప్లవాత్మక మార్పులతో రాష్ట్రాభివృద్ధి, ఆర్థిక రంగం పురోగతి, ప్రజలకందించిన సంక్షేమం, 2023లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంలో విజయవంతం, ఆరు నూతన పోర్టులు, 4 నూతన ఎయిర్‌పోర్టులు, నాడు–నేడు కింద 60వేల పాఠశాలల ఆధునికీకరణ, 17 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు తదితర అంశాలపై ప్రవాసాంధ్రులను చైతన్య పరచనున్నట్లు తెలిపారు.

### నెట్టికంటుడికి కిలో వెండి బహూకరణ



ఆలయ ఈఓ వాణికి వెండి తట్ట, చెంబును అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి డి.హీరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన భక్తుడు బి.శ్రీధర్‌రెడ్డి కిలో బరువున్న వెండి సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

### ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి: లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం సజ్జలదిన్నెకు చెందిన నరసింహులు (58)కు భార్య వరలక్ష్మి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం ఉదయం వ్యక్తిగత పనిపై భార్యతో కలసి నరసింహులు ద్విచక్ర వాహనంలో వైఎస్సార్ జిల్లా కడప వైపుగా బయలుదేరాడు. వీరాపురం గ్రామం వద్దకు చేరుకోగానే నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కగా ఆపిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో నరసింహులు తీవ్రంగా గాయపడగా, వరలక్ష్మి స్వల్ప గాయాలతో బయటపడింది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక నరసింహులు మృతిచెందాడు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# లెక్కలే తప్పారు!

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో ఎక్కువ మంది విద్యార్థులు గణితం సబ్జెక్టులోనే ఫెయిల్ అయ్యారు. మొత్తం 30,700 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 21,510 మంది 70.07 శాతం మంది ఉత్తీర్ణత సాధించిన విషయం తెలిసిందే. 29.93 శాతంతో 9,190 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఓవరాల్‌గా పరిశీలిస్తే జిల్లా కేంద్రంలోనే ఫెయిల్ అయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండడం గమనార్హం.



- పదో తరగతిలో అత్యధికంగా 7,012 మంది విద్యార్థులు 'గణితం'లో ఫెయిల్
- ఆయా సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రేపటి నుంచి ప్రత్యేక తరగతులు
- అన్ని మండలాల్లోనూ అమలుకు విద్యాశాఖ చర్యలు

**పాఠ్యాంశాల వారీగా ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య...**

| సబ్జెక్ట్ | హాజరైన విద్యార్థులు | ఉత్తీర్ణులు | ఫెయిల్ |
|---|---|---|---|
| గణితం | 30,988 మంది | 23,976 మంది | 7,012 మంది |
| సైన్స్ | 30,988 మంది | 25,486 మంది | 5,502 మంది |
| సోషల్ | 30,988 మంది | 26.313 మంది | 4,675 మంది |
| తెలుగు | 30,965 మంది | 28,031 మంది | 02,934 మంది |
| ఇంగ్లిష్ | 30,896 మంది | 28,608 మంది | 2,288 మంది |
| హిందీ | 30,839 మంది | 29,915 మంది | 0,924 మంది |

**గట్టెక్కించేలా శిక్షణ తరగతులు**



అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో వీలైనంతమంది విద్యార్థులు గట్టెక్కేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నాం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. నిర్దేశించిన తేదీల్లో కేటాయించిన సబ్జెక్టుల టీచర్లు హాజరై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి. కనీస మార్కులతోనైనా పాస్ అయ్యేలా వారిలో నైపుణ్యాలు మెరుగు పరచాలి. రేపటి నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక తరగతులు మే 18 వరకు కొనసాగుతాయి. ప్రతి మండలంలోనూ ఈ తరగతులు నిర్వహించాలి. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే ఎంఈఓలు, హెచ్ఎంలను బాధ్యులుగా పరిగణించాల్సి వస్తుంది.

– ఎం.ప్రసాద్‌బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల వెలువడిన పదోతరగతి పరీక్షల్లో అనంతపురం నగర పరిధిలోనే ఎక్కువ మంది విద్యార్థులు ఏదో ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యారు. అనంతపురంలో తెలుగు పరీక్ష రాసిన విద్యార్థుల్లో అత్యధికంగా 475 మంది ఫెయిల్‌కాగా, అత్యల్పంగా పుట్లూరు మండలంలో 21 మంది తప్పారు. హిందీ పరీక్షలో అనంతపురంలో 104 మంది ఫెయిల్ కాగా అత్యల్పంగా పెద్దవడుగూరు మండలంలో ఏడుగురు, ఇంగ్లిష్ పరీక్ష అనంతపురంలో 237 మంది ఫెయిల్ కాగా అత్యల్పంగా పెద్దవడుగూరు మండలంలో ఆరుగురు, గణితం పరీక్ష అనంతపురంలో 962 మంది ఫెయిల్ కాగా అత్యల్పంగా పెద్దపప్పూరు మండలంలో 66 మంది, సైన్స్ పరీక్ష అనంతపురంలో 684 మంది ఫెయిల్ కాగా అత్యల్పంగా పెద్దపప్పూరు మండలంలో 51 మంది, సోషల్ పరీక్ష అనంతపురంలో 585 మంది ఫెయిల్ కాగా అత్యల్పంగా పుట్లూరు మండలంలో 23 మంది ఉత్తీర్ణత తప్పారు.

**రేపటి నుంచి ప్రత్యేక తరగతులు**

ఫెయిల్ అయిన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. మే 19 నుంచి జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో వీలైనంత మందిని గట్టెక్కించేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఫెయిలైన విద్యార్థులకు మే 1 (రేపటి) నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయి. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రతి మండలంలో 2 నుంచి 3 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల అనుకూలాన్ని బట్టి ఆయా కేంద్రాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకుంటున్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి టీచర్లు హాజరయ్యేలా షెడ్యూలు ఖరారు చేశారు. కేటాయించిన తేదీల్లో ఖచ్చితంగా ఆయా సబ్జెక్టు టీచర్లు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపాలిటీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. కేజీబీవీ పాఠశాలల్లో ఈ శిక్షణ ఇప్పటికే ప్రారంభమైంది.

### అధినేతతో భేటీ



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ తన కుటుంబసభ్యులతో కలసి మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్తూ.. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలను చైతన్య పరచాలని ఈ సందర్భంగా రమేష్‌గౌడ్‌కు వైఎస్ జగన్ సూచించారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు రూరల్: స్థానిక కసాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వెనుక నివాసముంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి సూర్యనారాయణ రాజు ఇంట్లో చోరీ జరిగింది. తన కుటుంబసభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి ఆయన రెండు రోజులు క్రితం పుట్టపర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి వచ్చారు. అప్పటికే తలుపులు తీసి ఉండడం గమనించి సమాచారం ఇవ్వడంతో సీఐ ప్రవీణ్‌కుమార్, కసాపురం పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బీరువాలోని 6 తులాల బంగారు నగలు, రూ.12 వేల నగదు అపహరించినట్లుగా గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఆర్‌ఎస్‌కే సిబ్బంది హేతుబద్ధీకరణకు ఆమోదం



రేషనలైజేషన్‌పై చర్చిస్తున్న జేడీఏ, ఏపీఎంఐపీ పీడీ, డీడీహెచ్, డీఎస్ఓ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే)లో పనిచేస్తున్న సిబ్బంది హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్)కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ ఫిరోజ్‌ఖాన్, సూపరింటెండెంట్ బాషా, హెచ్ఓ రత్నకుమార్, సెరికల్చర్ ఆఫీసర్ డి.ఆంజనేయులు, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్ తదితరులు సమావేశమై చర్చించారు. రేషనలైజేషన్ లేదా రీడెప్లాయిమెంట్ (పునర్విభజన) పేరుతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 450 ఆర్‌బీకేలకు సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ మొదలు పెట్టారు. ఉమ్మడి జిల్లా ఆధారంగా రెండు మూడు రోజుల్లో ఈ ప్రక్రియను ముగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జిలుగా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్ (వీఏఏ), విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ (వీహెచ్ఏ), విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్ (వీఎస్ఏ) పనిచేస్తున్నారు. అలాగే కొన్ని ఆర్‌ఎస్‌కేలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు (ఎంపీఈఓలు) పనిచేస్తున్నారు. రేషనలైజేషన్ కింద సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో 1000 నుంచి 1,500 ఎకరాలకు ఒకరిని నియమించనున్నారు. 2024 ఖరీఫ్, 2025 రబీ ఈ–క్రాప్‌లో నమోదైన పంటల విస్తీర్ణం ఆధారంగా నియామకాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆయా మండలాలు, గ్రామాలు, ఆర్‌ఎస్‌కేల పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, మల్బరీ పంటల విస్తీర్ణాన్ని బట్టి... ఏది ఎక్కువగా ఉంటే ఆ శాఖ సిబ్బందికి తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## కౌలు రైతు ఆత్మహత్య



జయరాములు (ఫైల్)

బెళుగుప్ప: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన తలారి జయరాములు (55)కు భార్య శారదమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఏటా 10 నుంచి 15 ఎకరాల్లోని మామిడి చెట్లను గుత్తకు తీసుకుని ఫల సాయాన్ని మార్కెట్‌కు తరలించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది అదే గ్రామంలోని 12 ఎకరాల్లో మామిడి తోటను గుత్తకు తీసుకున్నాడు. ఇందుకు గాను చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు పైగా చేరుకుంది. మామిడి దిగుబడులు సరిగా రాకపోవడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక సోమవారం సాయంత్రం మామిడి తోటలో పురుగుల మందు తాగాడు. గమనించిన పక్క పొలంలోని రైతులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఎంపిక

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ అనుబంధ విభాగాల్లో మరికొందరికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా గొల్ల కిరీటప్ప (కళ్యాణదుర్గం), మాలపాటి శ్రీనివాసులు, బీరాల చంద్రశేఖర్, తలారి శివకుమార్(అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా వి.వేమన్న (రాయదుర్గం), మన్నల సత్యనారాయణ (అనంతపురం), డి.ఉమాపతి (తాడిపత్రి), యనుమల పాండురంగ (గుంతకల్లు), కార్యదర్శులుగా రామచంద్ర బోయ (గుంతకల్లు), బెస్త కోట వెంకటేష్, కోడూరి రాము (అనంతపురం), టి.నగేష్ (తాడిపత్రి), తలారి మల్లికార్జున (కళ్యాణదుర్గం), హళ్లి నాగరాజు(రాయదుర్గం), కె.గోవిందు (ఉరవకొండ), ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎస్.సుధాకర్ (గుంతకల్లు)కు అవకాశం కల్పించారు.

- బూత్ స్థాయి కమిటీ విభాగం: ఉపాధ్యక్షులుగా జంగం దేవేంద్రయాదవ్ (గుంతకల్లు), జీవీ రాఘవేంద్రరెడ్డి (తాడిపత్రి), ప్రధాన కార్యదర్శులుగా ఎస్.రామాంజులరెడ్డి (తాడిపత్రి), ఎన్‌బీ మహమ్మద్ రఫి (అనంతపురం), కురుబ కిషోర్ (గుంతకల్లు), కార్యదర్శులుగా నీటి సంకరప్ప, కేఎం.మహేష్(కళ్యాణదుర్గం)కు అవకాశం దక్కింది.
- దివ్యాంగుల విభాగం: ప్రధాన కార్యదర్శులుగా బి.రాజేష్ (ఉరవకొండ), ఎం.విశ్వనాథ్ (తాడిపత్రి), కార్యదర్శులుగా కె.బసవరాజు (కళ్యాణదుర్గం), శివప్ప (ఉరవకొండ)కు అవకాశం కల్పించారు.
- క్రిస్టియన్ మైనార్టీ విభాగం: ఉపాధ్యక్షుడిగా కె.రాజ్‌కుమార్ (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా మందాల మోనాలిసా (ఉరవకొండ), చిన్నపడమల పద్మాకర్‌రాజు, పుట్లూరు ప్రభాకర్ (అనంతపురం), కార్యదర్శులుగా మిద్దె సుధాకర్, రొద్దం హనుమంతప్ప (కళ్యాణదుర్గం), ముద్దనూరు శామ్యూల్(గుంతకల్లు), ఎం.సురేష్‌కుమార్ (తాడిపత్రి), ముర్తోటి సుజాత (ఉరవకొండ)కు అవకాశం దక్కింది.
- పంచాయతీరాజ్ విభాగం: ఉపాధ్యక్షులుగా కుమ్మత నారాయణరెడ్డి (గుంతకల్లు), కసిరెడ్డి వెంకటాక్షిపతి రెడ్డి (రాయదుర్గం), బంగారపు శ్రీనివాసరెడ్డి(కళ్యాణదుర్గం), ప్రధాన కార్యదర్శులుగా షేక్ హజరాబీ, కొనకొండ్ల ఆంజనేయులు, అరికల పురుషోత్తంరెడ్డి, సుధీర్‌రెడ్డి (అనంతపురం), కుమ్మత చంద్రశేఖర్‌రెడ్డి (రాయదుర్గం), వన్నూరురెడ్డి (కళ్యాణదుర్గం), బోయ రమేష్ (ఉరవకొండ), కార్యదర్శులుగా రుద్రానంద యాదవ్ (ఉరవకొండ), ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.రామాంజులరెడ్డి (తాడిపత్రి), ఆకుతోట గోపాలరెడ్డి, పైంతి మంజునాథ్ (కళ్యాణదుర్గం) ఎంపికయ్యారు.
- సాంస్కృతిక విభాగం: ప్రధాన కార్యదర్శులుగా పి.రామరంగారెడ్డి (గుంతకల్లు), పాల సోమిరెడ్డి (ఉరవకొండ), కార్యదర్శులుగా ఎం.వన్నూరుస్వామి, నారాయణరెడ్డి (కళ్యాణదుర్గం), పి.సంజీవరెడ్డి, ఆర్.భాస్కరరెడ్డి (తాడిపత్రి), పూజారి సురేష్ (ఉరవకొండ)కు అవకాశం కల్పించారు.
- గ్రీవెన్స్ సెల్ విభాగం: ప్రధాన కార్యదర్శులుగా గోవిందు మాల (ఉరవకొండ), సి.రంగేశ్వరరెడ్డి (తాడిపత్రి), కార్యదర్శులుగా కురుబ లక్ష్మీమారుతి, వడ్డె బయన్న (కళ్యాణదుర్గం), బెస్త మనోహర్ (గుంతకల్లు), ఎద్దుల జాకీర్‌హుస్సేన్ (అనంతపురం), ప్రకాష్‌గౌడ్ (ఉరవకొండ)కు అవకాశం దక్కింది.
- ఇంటలెక్చువల్ ఫోరం: ప్రధాన కార్యదర్శులుగా బి.కొండన్న (తాడిపత్రి), జయం శ్రీహరి, కె.శ్రీనివాసులు (అనంతపురం), కార్యదర్శులుగా గాజుల ఎర్రిస్వామి (కళ్యాణదుర్గం), రాజ్‌కుమారరెడ్డి (గుంతకల్లు)కు అవకాశం కల్పించారు.
- ఐటీ వింగ్: ప్రధాన కార్యదర్శులుగా సాయికిరణ్‌రెడ్డి (ఉరవకొండ), బి.సాయికృష్ణ ప్రసాద్ (తాడిపత్రి), కార్యదర్శులుగా ఎస్.సాయిఅనుదీప్, ఆలూరు నరేష్‌స్వామి (కళ్యాణదుర్గం), ధనరాజ్ (ఉరవకొండ), ముంచుమర్రి రాజశేఖరరెడ్డి (రాయదుర్గం) ఎంపికయ్యారు.
- లీగల్ సెల్: ఉపాధ్యక్షుడిగా పులి హనుమంతరెడ్డి (కళ్యాణదుర్గం), ప్రధాన కార్యదర్శులుగా వడ్డె నాగేంద్ర, తమ్మినేని మేదర రాఘవేంద్ర (అనంతపురం), మల్లపూరి శిరీష (గుంతకల్లు), ఏపీ రమణారెడ్డి (తాడిపత్రి), కార్యదర్శులుగా దాదా ఖలందర్, ఎర్రిస్వామి (కళ్యాణదుర్గం), అశ్వత్థ నారాయణరెడ్డి గుంతకల్లు) ఎంపికయ్యారు.
- ఆర్‌టీఐ వింగ్: ఉపాధ్యక్షుడిగా షేక్ మునీరా (అనంతపురం), ప్రధాన కార్యదర్శులుగా హేమంత్ బోయ (ఉరవకొండ), జి.నరసింహరెడ్డి (తాడిపత్రి), కార్యదర్శులుగా కటారు మంజునాథరెడ్డి, పోట్ల సునీల్ (కళ్యాణదుర్గం), మద్దినేని ఉమామహేష్ (ఉరవకొండ)కు అవకాశం కల్పించారు.

## పరిశ్రమలు స్థాపించకపోతే ప్లాట్లు రద్దు

- ప్రభుత్వ విప్ కాలవ, కలెక్టర్ వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్ (చిత్రంలో) విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం: పట్టణ శివారులోని ఉడేగోళం వద్ద టెక్స్‌టైల్ పార్కులో యూనిట్లు నెలకొల్పకుండా వృథాగా వదిలేసిన వారి ప్లాట్లను రద్దు చేసి కొత్త వారికి అవకాశం కల్పించాలని చేనేత జౌళి శాఖ అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. పరిశ్రమల స్థాపన అంశంపై రాయదుర్గంలోని మార్కెట్‌యార్డులో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో టెక్స్‌టైల్ పార్కులో ప్లాటు పొంది యూనిట్లు నెలకొల్పకుండా ఉన్నవారితో చర్చించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారు సానుకూలత వ్యక్తం చేయకపోతే ఒకటి లేదా రెండు నెలల గడువిచ్చి ఆ తర్వాత ప్లాట్లను రద్దు చేసి, ఆ స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, చేనేత జౌళిశాఖ సహాయకులు శ్రీనివాసరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహనా సోనీ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు, రాయదుర్గం టెక్స్‌టైల్ పార్కులో ప్లాటు పొందిన యజమానులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ఒంటరి జీవితాన్ని తాళలేక రాలిన పండుటాకు

- ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వృద్ధుడు

అనంతపురం: ఒంటరి జీవితంపై విరక్తితో ఓ పండుటాకు రాలిపోయింది. మృతి చెందిన భార్య జ్ఞాపకాలు వెంటాడుతుంటే మలివయస్సులో అర్ధంతరంగా తనువు చాలించాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రెవెన్యూ కాలనీ, షిర్డీనగర్‌లో నివాసముంటున్న కళ్లమడి నరసింహారెడ్డి (90)కి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె లక్ష్మీనరసమ్మను ఉరవకొండ మండలం ధర్మపురి గ్రామానికి చెందిన జయరామిరెడ్డికి ఇచ్చి వివాహం జరిపించారు. కుమారుడు ప్రభాకరరెడ్డి విజయవాడలోని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మూడేళ్ల క్రితం భార్య మృతి చెందడంతో మానసికంగా కుదేలైన నరసింహారెడ్డి కొంత కాలం విజయవాడలో కుమారుడి వద్ద ఉన్నారు. అయితే తనకు కాలక్షేపం కావడం లేదని, అనంతపురానికి పోతానంటూ పట్టుపడడంతో కుమారుడు కాదనలేకపోయాడు. ఈ నేపథ్యంలో కొన్ని నెలలుగా అనంతపురంలోని సొంతింటిలోనే ఒంటరిగా ఉంటున్న నరసింహారెడ్డి బాగోగులు చూసుకునేందుకు ఓ మనిషిని ఏర్పాటు చేశారు. రెండు నెలలకోసారి కుమారుడు వచ్చి తండ్రి బాగోగులు చూసుకుని కుమారుడు వెళ్లేవారు. కష్ట కాలంలో తనకు తోడుగా భార్య లేదంటూ పలువురితో చెప్పుకుని బాధపడే నరసింహారెడ్డి మంగళవారం ఇంట్లోని హాల్‌లో ఫ్యాన్‌కు పంచతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయాన్ని గుర్తించిన ప్రభాకరరెడ్డి పిన్నమ్మ వెంటనే ఆయనకు ఫోన్ చేసి తెలిపింది. దీంతో విజయవాడ నుంచి బయలుదేరిన ఆయన సాయంత్రం ఇంటికి చేరుకుని, బంధువుల సాయంతో తలుపు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి తండ్రి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



## మహిళా చైతన్యానికి సైకిల్‌యాత్ర

- పర్వతారోహకురాలు, సైకిలిస్ట్ సమీరాఖాన్



సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: మహిళ సాధికారత, వరకట్న వేధింపులు, గృహ హింసపై దేశ వ్యాప్తంగా మహిళల్లో చైతన్యం కలిగించేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు అనంతపురానికి చెందిన పర్వతారోహకురాలు, సైకిలిస్ట్ సమీరాఖాన్ తెలిపారు. తన యాత్ర నేపాల్ వరకూ సాగుతుందన్నారు. సైకిల్ యాత్రను కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళా సాధికారత కింద ఎవరెస్ట్ పర్వతారోహణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోలో సైక్లింగ్ క్రౌడ్ ఫండింగ్ ప్రచారాన్ని ప్రారంభించే ముందు మహిళ సాధికారతపై దృష్టి పెట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.ఉదయ్‌భాస్కర్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### దొంగకు దేహశుద్ధి

గుత్తి: స్థానిక రఘురాం రెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న రాధాకృష్ణ డ్రెస్ సెంటర్‌లో నగదు అపహరించిన యువకుడికి నిర్వాహకులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మంగళవారం ఉదయం డ్రెస్ సెంటర్‌లో ప్రవేశించిన యువకులు క్యాష్ బ్యాక్స్‌లోని రూ.10 వేలు అపహరిస్తూ పట్టుబడ్డాడు. పట్టుబడిన యువకుడిని గుత్తి ఆర్ఎస్‌కు చెందిన భాస్కర్‌గా గుర్తించారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### కేజీబీవీల్లో 'ప్రత్యేక' తరగతులు



విద్యార్థినులకు సూచనలిస్తున్న ఏపీసీ శైలజ

అనంతపురం ఎడ్యుకేషన్: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో (కేజీబీవీ) చదువుకుంటూ పదోతరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థినుల కోసం ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 32 కేజీబీవీల్లోని విద్యార్థినుల కోసం నల్లమాడ, గుమ్మఘట్ట, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. ఇంటర్‌లో 437 మంది, పదో తరగతిలో 303 మంది విద్యార్థినులు ఫెయిలయ్యారు. ఒక్కో కేంద్రంలో 128 నుంచి 175 మందిని కేటాయించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రోజు వరకూ ఈ ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. ఇందుకోసం కేజీబీవీల్లోని టీచింగ్ స్టాఫ్ సీఆర్టీలకు ప్రత్యేక షెడ్యూలును ఖరారు చేశారు. ఈ ప్రక్రియను సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

## వ్యక్తి దుర్మరణం



వెంకట్రామిరెడ్డి (ఫైల్)

శింగనమల: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరుకు చెందిన వెంకట్రామిరెడ్డి (44)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఓ కుమారుడు మండల టాపర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో కుమారుడుని బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ఆశ్రమంలో పాలిటెక్నిక్ కోచింగ్‌కు వదిలాడు. బుధవారం పాలిసెట్ ఉండడంతో మంగళవారం ఉదయం వెంకట్రామిరెడ్డి ఆశ్రమానికి వెళ్లి కుమారుడిని పిలుచుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. శింగనమల మండలం చక్రాయపేట వద్దకు చేరుకోగానే జాతీయ రహదారి 344డీ పై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వెంకట్రామిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ చితంబరప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

## నిరవధిక సమ్మెలో ఎంఎల్‌హెచ్‌పీలు



నిరవధిక సమ్మెలో పాల్గొన్న ఎంఎల్‌హెచ్‌పీలు

అనంతపురం మెడికల్: తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు గౌరి, అనూష, రాజేశ్వరి, శ్వేత మాట్లాడుతూ... ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న సీహెచ్ఓలను రెగ్యులరైజేషన్ చేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని కోరారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్ఓలకు మినహాయింపు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్, బదిలీలు, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు ఇవ్వాలన్నారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మెను విరమించబోమన్నారు.

## క్లుప్తంగా

### 18న ఉచిత సామూహిక వివాహాలు

**చెన్నేకొత్తపల్లి:** నిరుపేద కుటుంబాలకు పెళ్లి భారం కాకుండా మే నెల 18వ తేదీన మండల పరిధిలోని బసంపల్లి గ్రామ సమీపంలోని కైవారం అమరనారేయణస్వామి, సద్గురు యోగి నారేయణ మఠంలో ఉచిత సామూహిక వివాహాలు చేస్తున్నారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివాహాలు చేసుకోదల్చిన వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. వధువు వయస్సు 18, వరుడి వయస్సు 21 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలని, ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు.

### ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, ముస్లింలు

**అనంతపురం అర్బన్:** పహల్గాంలో పర్యాటకులను చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఇందిరానగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సావిత్రి, రామిరెడ్డి, శివారెడ్డి, రాము, ముస్తాఫా, చాంద్‌బాషా, మహబూబ్‌బాషా తదితరులు మాట్లాడారు. దేశంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

### భక్తిభావంతోనే ఉత్తమ జీవితం

- దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థులు



పూజలు చేస్తున్న దత్త విజయానందతీర్థులు

**అనంతపురం కల్చరల్:** భక్తిమార్గం మనిషిని ఉన్నతంగా నడిపిస్తుందని మైసూరు దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థులు అన్నారు. నగరంలోని అనఘా సమేత శ్రీదత్తాత్రేయస్వామి మందిరంలో జరుగుతున్న విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమానికి బుధవారం సాయంత్రం దత్త విజయానందతీర్థులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్వామీజీ శ్రీచక్రపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణంలో ధర్మమార్గం గురించి వివరించారు. గురువారం అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా దత్తపీఠాధిపతులు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ స్వయంగా విగ్రహ పునః ప్రతిష్టలో పాల్గొంటారని తెలిపారు. అలాగే బొమ్మేపర్తిలో పెద్ద ఎత్తున అక్షయ తృతీయ వేడుకలు జరుగుతాయని, అందరూ పాల్గొనాలని సూచించారు.

### పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సనపలో కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఆత్మకూరు:** పౌష్టిహారం తీసుకునే వారు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, అందువల్ల కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. మంగళవారం మండలంలోని పంపనూరు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లావణ్య మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో 'కిశోర వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన కిశోర బాలికలకు, బాలింతలకు జూన్ 10వ తేదీ వరకు వారంలో రెండు రోజులు సమావేశాలు ఏర్పాటు చేసి విద్య, సామాజిక, ఆర్థిక, సాధికారత గురించి తెలియజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. బాల్యవివాహాల అనర్థాలనూ వివరించారు.

# వన్నె తగ్గని బసవన్నకట్ట

- చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన వైనం
- నేడు సంఘ సంస్కర్త బసవేశ్వర జయంతి
- కర్ణాటక నుంచి విచ్చేసిన కళాకారులతో శోభాయాత్ర



నిలువెత్తు నందీశ్వరుడు



కొలువుదీరిన బసవేశ్వరుడు



బసవన్నకట్ట

**అనంతపురం కల్చరల్:** రాయల వారి పాలనలో జిల్లాలో ఎన్నో అపురూప కట్టడాలు నేటికీ చెక్కుచెదరని కళాకాంతులతో నాటి వైభవానికి సజీవ చిహ్నాలుగా ఉన్నాయి. అనంతపురం నగరం ఏర్పడిన తొలినాళ్లలోనే నిర్మించిన 'బసవన్నకట్ట' కూడా ఆ కోవలోకే వస్తుంది. బుధవారం బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని బసవన్న కట్టను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

**ఆసక్తికరమైన చరిత్ర**

పాతూరులో బసవన్న కట్టగా శతాబ్దాలుగా పూజలందుకుంటున్న ఆలయంలో అడుగడుగునా ప్రాచీన విశేషాలెన్నో కనిపిస్తాయి. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి కట్టడాలలో ఒకటిగా చెప్పుకునే ఈ ఆలయం నాటి హంపి శిల్పకళను మరిపిస్తూ చూపరులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా జిల్లాలోనే అతిపెద్ద నందీశ్వరులలో ఒకరుగా భక్తిభావం ఉట్టిపడేలా ఉంటుంది. ఒకనాడు వేల ఎకరాల మాన్యం ఉండేదని శాసనాలు చెపుతున్నాయి. కాలక్రమంలో అవికాస్తా కరిగిపోయి ఆలయం కుంచించుకుపోయినా ఇక్కడ వీరశైవ మతస్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**నేడు నగరంలో కళా విన్యాసాలు**

వీరశైవ సమాజం అధ్యక్షుడు ఎం.జి.రాజు ఆధ్వర్యంలో విశ్వగురు జగజ్యోతి మహాత్మా బసవేశ్వరుల జయంతి వేడుకల సందర్భంగా బుధవారం ఉదయం 7 గంటలకు కర్ణాటక నుంచి విచ్చేసిన కళాకారులతో శోభాయాత్ర నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వీరభద్రుని వేషధారణతో కళాకారులు కత్తులు తిప్పుతూ కళా విన్యాసాలను ప్రదర్శించనున్నారు. స్థానిక కృష్ణకళామందిర ప్రాంగణం ఎదురుగా ఉన్న ప్రియదర్శిని హోటల్ నుంచి ర్యాలీ సాగుతుంది. నగరోత్సవం టవర్‌క్లాక్, సుభాష్‌రోడ్డు, ఎలేక్రపి, సప్తగిరి సర్కిల్ మీదుగా పాతూరు బసవన్నకట్ట చేరుకుంటుంది. 10 గంటలకు బసవేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకార సేవలు జరుగుతాయని జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షులు ఎం.జి.రాజు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# బొమ్మేపర్తికి ఆధ్యాత్మిక శోభ

- నేటి నుంచి జయలక్ష్మీమాత జయంత్యుత్సవాలు



మాతృమూర్తి జయలక్ష్మి విగ్రహానికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

**రాప్తాడు:** గణపతి సచ్చిదానంద స్వామి మాతృమూర్తి జయలక్ష్మి మాత జయంత్యుత్సవాలు మండల పరిధిలోని బొమ్మేపర్తిలో ఐదు రోజుల పాటు ఘనంగా జరగనున్నాయి. బుధవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల కోసం గణపతి సచ్చిదానంద స్వామి, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామితో పాటు మైసూరు నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఇప్పటికే భారీగా తరలిరావడంతో గ్రామం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**4వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు**

నేటి నుంచి మే నెల 4వ తేదీ వరకు ఆశ్రమంలో గణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయని ఆశ్రమ ట్రస్టీ బోయ తిరుపాలు, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వెంకటనాయుడు తెలిపారు. రోజూ ఆశ్రమంలో శ్రీ చక్రపూజ, అర్చన, దివ్యనామ సంకీర్తనతో పాటు భక్తులకు వసతి, భోజన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్టు వారు వెల్లడించారు. బుధవారం బొమ్మేపర్తిలో గణపతి సచ్చిదానంద స్వామి, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ చేతుల మీదుగా అక్షయ తృతీయ పూజ, జయలక్ష్మి మాతా జయంత్యుత్సవాలు, లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ట తదితర పూజలు జరుగుతాయన్నారు.


# కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఓబిరెడ్డి, చింతా సోమశేఖర్‌రెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** కూటమి ప్రభుత్వం కార్మికులను విస్మరిస్తోందని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయీ బ్రాహ్మణులు, తోపుడు బండ్ల వ్యాపారులు, టైలర్లు, ఆటోడ్రైవర్లు, తదితరులకు ఏటా రూ.10,000 ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి కార్మికుల కష్టాలు పట్టడం లేదన్నారు. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడంలో వైఎస్సార్‌సీపీ ముందుంటుందన్నారు. మే 1 కార్మిక దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాల కార్మికులను సంఘటితం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు ఖాజా, నాయకులు గోగుల పుల్లయ్య, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు అక్ష య తృతీయ వేడుకలు



**అనంతపురం కల్చరల్:** దానధర్మాలకు, సంపదల పెంపునకు నెలవని భావించే పవిత్ర అక్షయ తృతీయ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. పురాణ విశిష్టత కల్గిన ఈ పర్వదినాన పుణ్యం ఎంత చేస్తే క్షయం అనేది లేకుండా అంత మోక్ష ప్రాప్తి కల్గుతుందని శాస్త్రోక్తి. అందుకు అనుగుణంగా నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు జరుగుతున్నాయి. పాతూరు వ్యాసరాజమఠంలోని నరసింహస్వామికి, మొదటి రోడ్డు మంత్రాలయ మఠం రాఘవేంద్రస్వామికి చందనోత్సవం నిర్వహిస్తున్నారు. అలాగే హెచ్చెల్సీ కాలనీలో ఐశ్వర్యేశ్వరుడికి సామూహిక వ్రతాలు జరిపిస్తున్నారు. బాబా మందిరాలలో సైతం అక్షయ తృతీయ సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు.

**బంగారం కొనుగోలుపై ఆసక్తి**

అక్షయ తృతీయ వచ్చిందంటే కొంచం బంగారమైనా కొని దాచుకోవాలనే సెంటిమెంటు స్థిరపడిపోవడంతో గత రెండు రోజులుగా బంగారు దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతా తులం బంగారం రూ.లక్షకు చేరుకున్నా కొనుగోళ్ల సందడిలో మార్పు లేదని బంగారం దుకాణాల నిర్వాహకులు చెబుతున్నారు.

### యువకుడికి తీవ్ర గాయాలు

**అనంతపురం:** నగరంలోని సంగమేశ్వర సర్కిల్‌లో మంగళవారం బైక్‌ను కారు ఢీ కొట్టింది. బైక్‌పై వెళుతున్న ఇటుకలపల్లికి చెందిన కిరణ్‌కుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని హుటాహుటిన 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# అలరించిన శాస్త్రీయ నృత్యాలు



నృత్య ప్రదర్శనతో అలరిస్తున్న చిన్నారులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం

**అనంతపురం కల్చరల్:** అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని శ్రీవిశ్వం నృత్య సంగీత అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక లలితకళాపరిషత్తులో కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కళాకారులు శాస్త్రీయ నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా నాట్యాచార్య విశ్వనాథరావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, సీనియర్ నటుడు సోమిరెడ్డి, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, వివేకానంద యోగాకేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి, అబ్బాటీవీ హరిప్రసాద్ తదితరులు మాట్లాడారు. శాస్త్రీయ నృత్యమే కాకుండా ఫోక్, వెస్టర్న్ నృత్యాలు కళాకారులను క్రమశిక్షణాయుతంగా, ఆరోగ్యంగా మారుస్తాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను నృత్యం నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డ్యాన్స్‌మాస్టర్ హరిప్రసాద్, కవులు రియాజుద్దీన్, ఈరన్న, జూటూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సప్పలమ్మకు బోనాలు



సుబ్బరాయనిపల్లిలో బోనాలతో సప్పలమ్మ దేవాలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

**చెన్నేకొత్తపల్లి:** మండల పరిధిలోని ముష్టికోవెల గ్రామ పంచాయతీ పరిధిలోని సుబ్బరాయనిపల్లిలో వెలసిన సప్పలమ్మకు మంగళవారం గ్రామస్తులు బోనాలు సమర్పించి పూజలు చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సప్పలమ్మదేవిని ప్రతిష్టించారు. 41 రోజుల అనంతరం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జాతర జరుపుకున్నారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలు తీసుకుని ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకొని అమ్మవారికి సమర్పించారు.

# భూసారం పెంపునకు సమష్టిగా కృషి



ఎస్‌హెచ్‌సీ కార్డులతో అధికారులు, రైతులు

**రాప్తాడురూరల్:** భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేద్దామని భూసార పరీక్షల వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ రాచనాపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా భూమిలోని పోషకాలను గుర్తించి సరిపడా ఎరువులను వినియోగించాలన్నారు. సాగు ఖర్చులు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. వేసవిలో మట్టి నమూనాలను సేకరించి వాటి ఫలితాలను ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అందిస్తామన్నారు. అనంతరం రైతులకు ఎస్‌హెచ్‌సీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శశికళ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి. రోషన్ జమీన్, సీఈఓ ఆర్. శ్రీనివాసులు, ఏఈఓ మురళీకృష్ణ, వీహెచ్‌ఏ శివశంకర్ పాల్గొన్నారు.

# ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు



ఖైదీ సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా జడ్జి రాజశేఖర్

**బుక్కరాయసముద్రం:** జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందించేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అనంతపురం జిల్లా జైలును ఆయన తనిఖీ చేశారు. ముందుగా జైల్లో ఖైదీల బ్యారెక్‌లను పరిశీలించారు. వంట గదులను తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలకు తయారు చేసిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందుతున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. జైలు వాతావరణం పరిశీలించారు. ఖైదీలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామన్నారు. ఖైదీలకు మంచి నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్, జైలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### తీగ జాతి పంటల సాగు లాభదాయకం

**కూడేరు:** ఉలువ, అలసంద, చిక్కుడు, పెసలు తదితర తీగజాతి పంటల సాగుతో లాభదాయకమని అనంతపురం డివిజన్ అగ్రికల్చర్ ఏడీ రవి తెలిపారు. మంగళవారం ఆయన కూడేరులోని వ్యవసాయ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతోందని రైతులు వేరుశనగ పంటనే కాకుండా తీగజాతి, ఇతర పంటలు సాగు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంట మార్పిడి చేస్తే భూసారం పెరిగి దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలానికి 670 భూసార పరీక్షలు చేసేలా టార్గెట్ ఇచ్చినట్లు తెలిపారు. మే 15 లోపు టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు.

### సమకాలీన పరిస్థితులపై నేడు సమాలోచన

**అనంతపురం కల్చరల్:** సమకాలీన పరిస్థితులపై సమాలోచన కార్యక్రమం బుధవారం సాయంత్రం 5.30 గంటల నుంచి స్థానిక పెన్షనర్ల భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ ఓ ప్రకటనలో తెలిపారు. జేవీవీ నాయకులతో పాటు మేధావులు, విద్యావేత్తలతో నిర్వహించే ఈ కార్యక్రమంలో పహల్గాం ఘటన, సింధు జల ఒప్పందం, వక్ఫ్ సవరణ బిల్లు, సేవ్ ఆర్‌డీటీ అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వెంకటరాముడు

**గార్లదిన్నె:** మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై సుధీర్ లారీ కాటా సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలు మేరకు.. గార్లదిన్నెకు చెందిన వెంకటరా ముడు అనే వ్యక్తి రాత్రి సమయంలో సుధీర్ లారీ కాటా వద్ద రోడ్డు అవతలి వైపు దాటుతుండగా అదే సమయంలో అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో అతడి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో క్షతగాత్రున్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 7న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

**గార్లదిన్నె:** మండలంలోని యర్రగుంట్లలో మే 7న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ దశమి రోజు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. 5వ తేదీ పతాక ఆవిష్కరణ, 6న ముహూర్తం, గణపతి పూజ, అభిషేకం, 7న ఉదయం 6-15 నిషాలకు స్వామి వారి కల్యాణం,ఆరాధన నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

### యువకుడి మృతి



మృతిచెందిన విజయ్

**గుత్తి రూరల్:** మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ విజయ్ అనే యువకుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గుత్తి పట్టణంలోని తాడిపత్రి రోడ్డు జంగాల కాలనీకి చెందిన విజయ్ పని నిమిత్తం వెళ్తుండగా ఈ నెల 10న జక్కలచెరువు గ్రామ శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గుత్తి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. అక్కడ 20 రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక అతడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులకు అందని వేతనాలు

**అనంతపురం మెడికల్:** ప్రతి నెలా మొదటిరోజునే వేతనాలు అందిస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత చంద్రబాబు విస్మరించారు. అత్యంత కీలకమైన విభాగాలకు సంబంధించి ఉద్యోగులకు వేతనాల మంజూరులో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తోంది. అందులో భాగంగా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులకు 30 రోజులు దాటినా.. ఇప్పటికీ వేతనాలు జమకాలేదు. దీంతో కుటుంబపోషణ భారమై స్టాఫ్‌నర్సులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మొత్తం 200 మంది కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోగులకు సేవలందించడంలో వీరే కీలకం. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని తమకు సకాలంలో వేతనాలు అందేలా చూడాలని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు కోరుతున్నారు.



